క్లుప్తంగా

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: అనాథ శవానికి మమత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు శుక్రవారం తుది శ్వాస విడిచాడు. అతనికి ఎవరూ లేక పోవడంతో, సమాచారం తెలుసుకున్న మమత చారిటుబుల్ ట్రస్టు ఫౌండర్ ఎల్లేటి మమత కేజీహెచ్‌కు వెళ్లి మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్సులో జ్ఞానాపురం శ్మశాన వాటికకు తీసుకొచ్చి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. అనాథ శవానికి అంత్యక్రియలు చేసిన ఎల్లేటి మమతను పలువురు అభినందించారు.

కబడ్డీ.. కబడ్డీ



గోపాలపట్నం హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

గోపాలపట్నం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు శుక్రవారం గోపాలపట్నం హైస్కూల్ మైదానంలో ఉత్సాహంగా సాగాయి. ఉదయం నుంచి కబడ్డీ, షటిల్ బాడ్మింటన్, బాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అలాగే 89వ వార్డు చంద్రనగర్ మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పలు పాఠశాలల పీడీలు, సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించారు.


అగ్నిప్రమాద బాధితుడికి ఆడారి ఆనంద్ పరామర్శ



ప్రమాదంలో దగ్ధమైన దాబాను పరిశీలిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సర్వీసు రోడ్డులో బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా దగ్ధమైన దాబాను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ 63వ వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్‌కు చెందిన రాయల్ ఫుడ్ కోర్టు (దాబా)లో అగ్నిప్రమాదం కారణంగా సుమారు రూ. 9లక్షలు నష్టం జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు సురేష్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రమాదంపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన సాయం త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని బాధితుడికి ఆడారి ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులతో కలిసి శ్రమదానం



చెత్త తొలగింపులో పారిశుధ్య కార్మికులకు సాయం చేస్తున్న పత్నిరావు

మల్కాపురం: పారిశుధ్య కార్మికుల సమ్మె ముగిసింది. దీంతో వారు శుక్రవారం ఉదయం నుంచి వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. 60వ వార్డులోని పలు ప్రాంతాల్లో గల సర్వీస్ రోడ్లపై పేరుకున్న వ్యర్థాలను కార్మికులు తరలించారు. ఆ సమయంలో వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి పత్నిరావు అక్కడికి చేరుకుని పారిశుధ్య కార్మికులకు అవసరమైన సాయం అందించారు. ప్రజలు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన అన్నారు.



బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో భోగి మంట వెలిగిస్తున్న బెహరా భాస్కరరావు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న రమాకుమారి

ఆనందంగా సంక్రాంతి పండగ

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆకాంక్ష
- ఘనంగా ముందస్తు సంబరాలు

విశాఖ విద్య: సంక్రాంతి పండగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆకాంక్షించారు. నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన 90వ వార్డుకు చెందిన మహిళలకు శుక్రవారం రాత్రి బుచ్చిరాజుపాలెంలో జరిగిన కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. విజేతలతోపాటు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్న మహిళలకు కూడా సంక్రాంతి కానుకను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. మహిళా అభ్యున్నతితోనే సమాజం అన్ని రంగాల్లోనూ ముందుంటుందన్నారు. మహిళలను ప్రోత్సహించాలనే తలంపుతో ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని పార్టీ నాయకుడు నమ్మి శ్రీను అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.కృష్ణ(అల్ఫా కృష్ణ), పార్టీ నాయకులు చుక్కా ప్రసాద రెడ్డి, వై.వెంకటేశ్వరరావు, రామకృష్ణ, మహిళా నాయకురాలు కొనాల విజయ వినీత తదితరులు పాల్గొన్నారు.

బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో సందడి

గోపాలపట్నం: నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు సందడిగా జరిగాయి. వేడుకలను బెహరా విద్యా సంస్థల చైర్మన్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ప్రారంభించారు. కళాశాల ప్రాంగణాన్ని విద్యార్థులు రంగురంగు రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. భోగి మంటలు, డూడూ బసవన్నలు, హరిదాసులతో సందడి చేశారు. సంప్రదాయ బద్ధంగా పాలు పొంగించిన పాత్రలో ఆయన బియ్యం వేశారు. ఉపాధ్యాయులు పాయసం తయారు చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా భాస్కరరావు విద్యార్థులకు, అధ్యాపకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య, అసిస్టెంట్ డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నౌసేనబాగ్ కేంద్రీయ విద్యాలయం-1 ఆవరణలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

కేంద్రీయ విద్యాలయంలో..

సింధియా: మల్కాపురంలోని నౌసేనబాగ్ కేంద్రీయ విద్యాలయం-1 ఆవరణలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. డూడూ బసవన్నలు, రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, గాలిపటాలు, హరిదాసుల కీర్తనలు తెలుగు సంస్కృతీ సంప్రదాయలు ఉట్టిపడేటట్లుగా ఎంతో వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మైంగీ మాట్లాడుతూ టెక్నాలజీ పెరుగుతున్న ఈ రోజుల్లో కూడా తెలుగు సంప్రదాయానికి అధిక ప్రాధ్యానమిస్తూ పిల్లలకు మన సంస్కృతీ సంప్రదాయాలను అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరాజుపాలెంలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సెయింట్ ఆన్స్ కళాశాలలో.

మల్కాపురం: స్థానిక సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఇంటర్,డిగ్రీ విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారనలో వచ్చి తొలుత రంగ రంగుల ముగ్గులు వేశారు. భోగి మంట వేసి దాని చుట్టూ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. రైతు,హరిదాసు,డూడూ బసవన్న వేషధారణల్లో విద్యార్థినులు అలరించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషా మాధురి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు శుక్రవారం నక్కవానిపాలెం పార్టీ కార్యాలయంలో శుక్రవారం బహుమతులు అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి పాల్గొని విజేతలకు బహుమతులు అందించి అభినందించారు.కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరావు (పాడుగు రాజు) వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి,నాయకులు సత్యనారాయణరెడ్డి, కోటా కృష్ణ, జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు పాల్గొన్నారు.

నగర వాసుల పల్లెబాట

పండక్కి సొంతూళ్లకు పయనం



ఎన్‌ఏడీ సెంటర్ వద్ద బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

విశాఖ విద్య: తెలుగింట పెద్ద పండగకు నగర వాసులు పల్లెబాట పడుతున్నారు. దీంతో ఎన్ఏడీ సెంటర్ ప్రయాణుకులతో రద్దీగా మారింది. సంక్రాంతి పండగ నేపథ్యంలో విద్యా సంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఎక్కువ మంది స్వగ్రామాలకు వెళ్లేందుకు క్యూ కట్టారు. ఎన్ఏడీ సెంటర్‌లోని బస్టాప్‌లో ప్రయాణిలకు ఆర్టీసీ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఎన్ఏడీ చుట్టు పక్కల ప్రాంతాల వారు ఇక్కడే బస్సులు ఎక్కేందుకు వస్తారు. దీంతో ప్రయాణికులకు బస్సులు ఎక్కించడంతో పాటు రద్దీని నియంత్రించేందుకు ఆర్టీసీ సిబ్బందిని నియమించింది.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ముస్లింలు, చిన్నారులు

సీతమ్మధార: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెంలోని మదీనా మెమోరియల్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హజరత్ ఖాదర్ వలీ, హజరత్ మౌలా ఆలీ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మసీదుల్లో ముస్లింలు ఖురాన్ పఠించి చిన్నారులచే నాతే కలం ఆలపించారు. పరిసర ప్రాంతాల్లో చందనోత్సవ ర్యాలీ చేసి, పాతీహఖానీ జరిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం చిన్నారులచే ప్రత్యేక కార్యక్రమం, ఆదివారం కవ్వాలి పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ సురేష్

మల్కాపురం: దేశ కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల శాంతిగిరి కాలనీలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అక్కడి వివేకానంద విగ్రహానికి ఆడారి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, పార్టీ 60వ వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్, జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

➡ బీజేపీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో శాంతిగిరి కాలనీలోని స్వామి వివేకానంద విగ్రహానికి పార్టీ నగర నాయకుడు పాలిమేర శ్రీనివాస్‌రావు, ఎస్సీ మోర్చా ప్రతినిధి విజయబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో శ్రీ పద్మనాభనగర్ గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



పద్మనాభనగర్‌లో మాట్లాడుతున్న నందవరపు సోములు



వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి

➡ నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో వివేకానందుడి చిత్రపటాని ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుడు నేటి తరానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు.

హలో... బీ కేర్‌ఫుల్



ఎన్ఏడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్పీకర్

- హైవేపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు
- ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌పై మైక్ సిస్టమ్
- ఇక టూ వీలర్స్, ఆటోలకు బ్రేక్

విశాఖ విద్య: జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గాజువాక నుంచి బిర్లా జంక్షన్ వరకు జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుండడంతో.. వాటికి అడ్డుకట్ట వేసేలా పటిష్టమైన చర్యలు చేపట్టారు. వాహన ప్రమాదాలను నియంత్రించడంతో పాటు, ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. దీనిలో భాగంగా హైవేపై ప్రధాన కూడళ్లలో 'మైక్ సిస్టమ్'ను ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చారు. ప్రధానంగా ఎన్ఏడీ సెంటర్‌లో ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించారు.

ఫ్లై ఓవర్‌పై టూ వీలర్స్, ఆటోలు నిషేధం

ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌పై నుంచి ద్విచక్రవాహనాలు, ఆటోల రాకపోకలకు చెక్ పెట్టారు. ఫ్లై ఓవర్ విశాలంగా ఉండడంతో వాహనాలు రయ్ మంటూ దూసుకుపోతున్నాయి. వీటి మధ్య టూ వీలర్స్, ఆటోల వస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక ఫ్లై ఓవర్ కింద నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రయాణాలు సాగించేలా చర్యలు చేపట్టారు. దీనిపై ఇక్కడ ఏర్పాటు చేసిన మైక్ సిస్టమ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ప్రధాన సెంటర్లలో మైక్ సిస్టమ్

హైవేపై ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఎయిర్‌పోర్టు సెంటర్ నుంచి అక్కయ్యపాలెం సెంటర్ వరకు ప్రధాన కూడళ్లలో మైక్ సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటికే ఎన్ఏడీ, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, బిర్లా జంక్షన్లలో మైక్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు. బర్మా క్యాంప్(కంచరపాలెం) వద్ద ఏర్పాటు చేసిన మైక్ సిస్టమ్‌ను శుక్రవారం ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్ ప్రారంభించారు. ఇదే రీతిన మర్రిపాలెం సెంటర్‌లో కూడా ఏర్పాటు చేయనున్నారు. విధుల్లో ఉండే ట్రాఫిక్ సిబ్బంది రహదారి భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తారు.



ఎన్ఏడీ ఫ్లై ఓవర్

గీత దాటితే ఇంటికే ఫైన్

హైవేపై ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆటో వాలాలు, ద్విచక్రవాహనదారుల స్పీడుకు ఇక బ్రేక్‌లు పడనున్నాయి. రెడ్ సిగ్నల్ పడినప్పటికీ కొంతమంది గీత దాటి మరీ వాహనాలు ముందుకు పోనిస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలకు ఉపక్రమించే క్రమంలో ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాల అనుసంధానంతో వాహనదారులకు జరిమానా విధించేలా ఏర్పాట్లు చేశారు. రెడ్‌సిగ్నల్ పడిన తర్వాత గీత దాటి ముందుకు వెళ్లే వారి వాహన నంబర్ ఆధారంగా ఆధార్ అనుసంధానంతో ఉన్న సదరు వాహన యజమాని ఇంటి నంబర్‌కు జరిమానా రశీదు వెళ్లనుంది.



ఎన్ఏడీ సెంటర్‌లో మైక్ ద్వారా అనౌన్స్ చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గణేష్

వాహనదారులు సహకరించాలి

రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా 'వేగం వద్దు-ప్రాణం ముద్దు' అనే నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రధాన సెంటర్లలో మైక్ సిస్టమ్స్ ఏర్పాటు చేశాం. వీటి వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌పై టూ వీలర్స్, ఆటోల రాకపోకలను పూర్తిగా నిషేధిస్తున్నాం. వాహనదారులు సహకరించాలి.

– మళ్ల అప్పారావు, ట్రాఫిక్ సీఐ

అర్హులందరికీ ఓటు హక్కు

- 22న తుది జాబితా ప్రకటన
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

విశాఖ విద్య: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని విశాఖ ఆర్డీవో, పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ అన్నారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఓటరు జాబితాల తయారీపై మండలాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాజా నివేదికల మేరకు సిద్ధం చేసిన ఓటరు జాబితాలు, వాటిపై అభ్యంతరాలను రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు పొందేందుకు గడువు లోగా అందిన దరఖాస్తులు, అదే విధంగా చేర్పులు-మార్పులపై క్షేత్రస్థాయిలో సిబ్బంది పని తీరుపై మండల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు లేవనెత్తిన అభ్యంతరాలను కూడా పరిగణలోకి తీసుకొని వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితాలో ఒకే వ్యక్తి పేరు రెండు చోట్ల ఉండటానికి వీల్లేదన్నారు. ప్రతీ దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన చేసేలా సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులపై ఉందన్నారు. ఉన్నతాధికారులు ఏ సమాచారం కోరినా వెంటనే పంపించేలా సమగ్ర నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. తుది జాబితాను ఈ నెల 22న ప్రకటించడం జరుగుతుందన్నారు.

ఆధ్యాత్మిక సమన్వయం.. పవిత్ర యజ్ఞం

మహారాణిపేట : ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయమనేది పవిత్రమైన యజ్ఞమని జగద్గురు పీఠం భౌగోళిక కో-ఆర్డినేటర్ జర్మన్ దేశీయుడు లుడ్జర్ ఫిలిప్స్ పేర్కొన్నారు. అంకోసా ఫంక్షన్ హాలులో శుక్రవారం జగద్గురు పీఠం సోదర బృందం నిర్వహించిన ప్రాక్పశ్చిమ సభా కార్యక్రమంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. సంస్థ వ్యవస్థాపకులు మాస్టర్ ఈకే, గతంలో భౌగోళికంగా సేవలందించిన మాస్టర్ కె.పార్వతీకుమార్ వివిధ దేశాల్లో చేసిన ప్రసంగాలు, వారు రాసిన గ్రంథాల్లో ఉన్న పరమ గురువుల మార్గానికి నేడు వేలాది మంది పాశ్చాత్యులు ప్రభావితం చెందుతున్నారన్నారని లుడ్జర్ వివరించారు. సభకు అధ్యక్షత వహించిన సంస్థ భౌగోళిక నిర్వాహకులు కె. గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రాక్పశ్చిమ యజ్ఞ నిర్వహణలో భాగంగా మాస్టర్ పార్వతీకుమార్ 65 పర్యాయాలు విదేశాలలో పర్యటించారన్నారు. మాస్టర్ ఈకే రాసిన ఓవర్సీస్ మెసేజెస్ 8వ సంపుటాన్ని, అలాగే పార్వతీకుమార్ రాసిన సెవెన్ రేస్ ఆఫ్ లైట్ అనే జర్మన్ అనువాద గ్రంథాన్ని ఆవిష్కరించారు. స్పెయిన్ వనిత దోనా, అర్జెంటైనాకు చెందిన రేయస్, సంస్థ కార్యదర్శి బీఆర్‌కే రాజు, అజ్జరపు శ్రీనివాస్, జ్యోతిషాచార్య ఎస్ఎస్ఎస్ రాము, బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్. శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న లుడ్జర్, గురుప్రసాద్

ఘనంగా కూడార్రై ఉత్సవం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా శుక్రవారం కూడార్రై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోదాదేవి ఉత్సవమూర్తిని తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలకరించి పల్లకీలో తీసుకువచ్చి ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద అదిష్టింపజేశారు. ఆలయంలోంచి వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను తీసుకొచ్చి నీలాద్రి గుమ్మం వద్ద ఆస్థాన మండపంలో వేంచేయజేసి ఎదురు సన్నాహోత్సవాన్ని వైభవంగా జరిపారు. పాశుర విన్నపం, సాత్తుమొర్రై, ధనుర్మాస పూజలు జరిపారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈపూజలు నిర్వహించారు.

యూజీడీ సమస్య పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్ లక్ష్మణరావుకు సమస్యలను వివరిస్తున్న ఎన్టీఆర్ కాలనీ ప్రజలు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో యూజీడీ సమస్య పరిష్కరించాలని కోరుతూ కాలనీ ప్రజలు శుక్రవారం వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావుకు వినతి పత్రం అందజేశారు. కాలనీలోని 4,5 బ్లాక్‌లకు సంబంధించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతో పాటు సెప్టిక్ ట్యాంకులు నిండిపోయి మ్యాన్ హోల్స్ ద్వారా బయటకు రావడంతో దుర్వాసన వెదజల్లుతుందని వివరించారు. అలాగే మోటారు పంపుల మరమ్మతులు పూర్తి చేసి సక్రమంగా మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలపై స్పందించిన లక్ష్మణరావు సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.